క్లుప్తంగా

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న షిర్డీ సాయిబాబా

బొబ్బిలి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయి బాబా ఆలయంలో దసరా సందర్భంగా గురువారం ప్రత్యే పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించా రు. పూజలు అనంతరం ఆలయం వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

విద్యుత్‌శాఖ డీఈఈగా తిరుపతిరావు


డీఈఈ తిరుపతిరావు

రాజాం సిటీ: రాజాం విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ)గా ఆర్.తిరుపతిరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ పనిచేసిన డీఈఈ ఫణీంద్రకుమార్ ఉద్యోగ విరమణ చేయడంతో ఈయన స్థానం పార్వతీపురం నుంచి తిరుపతిరావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. డీఈఈకి రాజాం, రేగిడి, సంతకవిటి మండలాల ఏఈలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ


హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓలు

రేగిడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సెమిస్టర్-2కు సంబంధించిన పాఠ్యపుస్తకాలను స్థానిక ఎమ్మార్సీలో పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓలు ఎం.వి.ప్రసాదరావు, బి.ఎరకయ్య శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు 10,816 పుస్తకాలు వచ్చాయని, మరికొన్ని పుస్తకాలు రావాల్సి ఉందని ఎంఈఓలు చెప్పారు. పాఠ్యపుస్తకాలు రాగానే అందరికీ అందజేస్తామని తెలిపారు.

రాజయ్యపేటలో గ్రామసభ


గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు


రాజాం: మండలంలోని రాజయ్యపేట గ్రామ సచివాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీడీఓ జె.ఆనందరావు ప్రజలను ఆరాతీసారు. పీ4 సర్వే వివరాలు, ఉద్యోగులు దత్తత తీసుకున్న కుటుంబాలు, తదితర విషయాలపై సమీక్ష నిర్వహించారు. గ్రామంలో సమిత్వ సర్వే వేగవంతం చేయాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు అర్హత


ఎస్.నాగరాజు, వై.సతీష్

రాజాం సిటీ: స్థానిక జీసీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తమ్ శుక్రవారం తెలిపారు. గత నెల 24న డాక్టర్ బీఆర్ఏయూలో నిర్వహించిన అంతర యూనివర్సిటీ కబడ్డీ పోటీల్లో కళాశాలకు చెందిన ఎస్.నాగరాజు, వై.సతీష్ సత్తా చాటారని చెప్పారు. వీరు ఈ నెల 4 నుంచి 8 వరకు కర్నాటకలో నిర్వహించ నున్న సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు పీడీ సీహెచ్.కేశవనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

కూలిన శిథిల భవనం


తారకరామ కాలనీలో కూలిన భవనం

బొబ్బిలి: పట్టణంలోని తారకరామా కాలనీలో నిర్వహణలో లేని డీపీఈపీ పాఠశాల భవనం శుక్రవారం కుప్పకూలింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భవనం గోడలు నాని మధ్యాహ్నం సమయంలో కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవ రూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.నిర్వహణలో లేని పాత భవనాలను కూల్చాలని,చిన్నారులు వాటిలోకి ఆడుకునేందుకు వెళ్లే అవకాశం ఉందని, ఆ సమయంలో భవనాలు కూలిపోతే ప్రాణనష్టం తప్పదని పట్టణ వాసులు అంటున్నారు. పాఠశాలల్లో వినియోగంలో లేని శిథిల భవనాలను తొలగించాలని పలుమార్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారని పట్టణవాసులు వాపోతున్నారు.ఇప్పటికైనా శిథిలభవనాలను తొలగించాలని కోరుతున్నారు.

ఈదుర గాలుల బీభత్సం

- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు
- దసరా పండగ రోజు అంధకారంలో గ్రామాలు
- విద్యుత్ శాఖకు భారీ నష్టం
- నేలకొరిగిన అరటి,చాపచుట్టేసిన మొక్కజొన్న
- నీటమునిగిన వరి, దెబ్బతిన్న కూరగాయల పంటలు


రామభద్రపురం: కోటశిర్లాం వెళ్లే రహదారిలో కూలిన చెట్లు

బొబ్బిలి/బొబ్బిలిరూరల్/తెర్లాం/ రామభద్రపురం/వంగర/ రాజాం/: తుఫాన్ ప్రభావంతో బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షం, ఈదురు గాలుల వల్ల ఇటు రైతులు, అటు విద్యుత్ శాఖకు భారీనష్టం కలిగింది. విద్యుత్ స్తంభాలు నేలకొరగగా, పలు చోట్ల లైన్లు తెగిపడ్డాయి. అరటితోటలు నేల మట్టమయ్యాయి. మొక్క జొన్న చేను చాపచుట్టేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.మండలంలోని పెంట, అలజంగి, మెట్టవలస తదితర గ్రామాల్లో సుమారు 55 ఎకరాల్లో అరటిపంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.పూర్తి నష్టంపై స్పష్టత రావాల్సి ఉందని,మరో రెండు రోజుల్లో నివేదిక తయారు చేస్తామని ఉద్యానవన శాఖ అధికారి వెంకటరత్నం తెలిపారు. రేగిడి మండలంలోని ఆకులలోవకట్టగెడ్డ ఉప్పొంగడంతో పంటపొలాలు నీటమునిగాయి. ఉణుకూరు, ఏ.వి.పురం, అంబాడ తదితర గ్రామాల్లోని పంటపొలాలు నీటమునిగాయి. పొట్టదశలో ఉన్న వరిపంట నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాజాం మండలంలోని పొగిరి, లక్ష్మీపురం, నందబలగ, వి.ఆర్.అగ్రహారం తదితర ప్రాంతాల్లో మొక్కజొన్నపంట దెబ్బతింది. ఇప్పటికే పంటకోత చేసిన వారు ఆరబెట్టిన మొక్కజొన్న గింజలు వర్షానికి తడిచిపోయాయి. కొన్ని గ్రామాల్లో చెరకుపంటకు కూడా నష్టం వాటిల్లింది.

విరిగిపడిన 53 విద్యుత్ స్తంభాలు

బొబ్బిలి డివిజన్‌లోని 9 సబ్‌స్టేషన్ల పరిధిలో156 గ్రామాలు దసరా రోజున అంధకారంలో మగ్గాయి. గురువారం వీచిన ఈదురుగాలులకు డివిజన్ పరిధిలో 53 విద్యుత్ స్తంభాలు విరిగిపోగా, గ్రామాలు,పట్టణ ప్రాంతాల్లోని 55 హెచ్‌టీ లైన్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది శ్రమించి గురువారం రాత్రికి 140 గ్రామాలకు, విద్యుత్ సరఫరా పునరుద్ధరిం చగా, మిగిలిన గ్రామాలకు శుక్రవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో పండగపూట ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తాగునీటికి సైతం అవస్థలు పడాల్సి వచ్చింది. విద్యుత్ శాఖ ఏఈలు,డీఈలు, ఈఈలు సిబ్బందితో కలిసి కూలిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం, కొన్ని చోట్ల స్తంభాలు, విద్యుత్ తీగలను సరిచేయించే పనులను చేయించారు. అలాగే రాజాం పట్టణంతో పాటు రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లోని పలుగ్రామాల్లో చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఎలక్ట్రికల్ సిబ్బంది, అధికారులు దసరా సెలవుల్లో ఉండడం, సిబ్బంది కొరత కారణంగా సకాలంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేకపోయారు.


రామభద్రపురం: రామభద్రపురంలో దెబ్బతిన్న మిరప పంట


వంగర: ఎం.సీతారాంపురంలో తెగిపడిన విద్యుత్ తీగలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామారావు


బొబ్బిలి రూరల్: బొబ్బిలి మండలంలో నేలకొరిగిన అరటి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన


రేగిడి: అంబాడలో నీటమునిగిన వరిపంటపొలాలు


రాజాం: వి.ఆర్.అగ్రహారంలో తడిచి పోయిన మొక్క జొన్న గింజలను శుక్రవారం ఆరబెట్టిన రైతులు


బొబ్బిలి: బొబ్బిలి మండలం భోజరాజపురంలో వాలిన విద్యుత్ స్తంభం


బొబ్బిలిరూరల్: పెంట గ్రామంలో విరిగిన విద్యుత్ స్తంభం


తెర్లాం: నందిగాం ఫీడర్‌లో విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మలు


తెర్లాంపూనువలస పంచాయతీలో గాలులకు విరిగి పడిన విద్యుత్ స్తంభం

మడ్డువలస ప్రాజెక్టు పరిశీలన


మడ్డువలస ప్రాజెక్టు వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ ఆశయ్య

వంగర: మడ్డువలసలోని గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టును చీపురుపల్లి ఆర్డీఓ బి.ఆశయ్య శుక్రవారం పరిశీలించారు. ప్రాజెక్టు లో నీటి నిల్వ, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను ప్రాజెక్ట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ ప్రాజెక్టు వద్ద, నదుల్లో నీటిప్రవాహం పెరిగితే ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టులో ఇన్ అండ్ ఔట్‌ఫ్లో సమాచారం ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరవేయాలన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ పిన్నింటి రామారావు, డీఈ పి.అర్జున్, ఏఈ నితిన్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

చెరువులు,నదుల్లో దిగొద్దు


బూర్జివలసలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ సతీష్‌కుమార్

బొబ్బిలిరూరల్: వర్షాల కారణంగా వేగావతి నది ఉధృతంగా ప్రవహిస్తోందని, చెరువులు సైతం పూర్తిగా నిండి ఉన్నందున వాటిలో స్నానాలకు దిగవద్దని సీఐ సతీష్‌కుమార్ సూచించారు.మండలంలోని దిబ్బగుడ్డివలసతో పాటు నదీ పరివాహక ప్రాంతాలైన పెంట,పారాది,బూర్జివలస తదితర గ్రామాల్లో శుక్రవారం పర్యటించి ప్రజల ను అప్రమత్తం చేశారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన ఇద్దరు భవానీ భక్తులు స్నానం కోసమని ఇటీవల వేగావతి నదిలో దిగి ఒకరు, చెరువులో మునిగి ఒకరు చనిపోయారని చెప్పారు. మరోమారు అలాంటి దుర్ఘటనలు జరగకుండా గ్రామ పెద్దలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు.

12వ పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి


మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

రాజాం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, మున్సిపల్ కార్మికులకు కూడా పీఆర్‌సీ వర్తింప చేయడంతో పాటు వేతన బకాయిలు చెల్లించాలని కార్మిక సంఘాల గౌరవ అధ్యక్షుడు సీహెచ్.రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్మికులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నేటికీ ఏ ఒక్కటి అమలు చేయకపోవడం సరి కాదన్నారు. సమాన పనికి సమానవేతనం అమలుచేయకుండా కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటోందని మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికి కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.మున్సిపల్ కార్మిక యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మి, అనిల్‌కుమార్, బాలరాజు, గురువులు, వైకుంఠ, వాసు, సుధాకర్, కృష్ణ, సింహాచలం, గోపి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు


అశోక్‌ను సత్కరిస్తున్న డీఎస్పీభవ్యారెడ్డి, సీఐ,తదితరులు

బొబ్బిలి: ఏ శాఖకు సంబంధించిన ఉద్యోగులైనా చిత్తశుద్ధి, అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు ఉంటుందని డీఎస్పీ జి.భవ్యారెడ్డి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న కానిస్టేబుల్ ఎం.అశోక్ ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో గురుకుల పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి వీడ్కోలు పలికిన ఆయన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ కె.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. కానిస్టేబుల్‌గా అశోక్ అందించిన సేవలను అధికారులు ప్రశంసించారు. ఎస్‌ఐ ఆర్.రమేష్ కుమార్, ఏఎస్‌ఐలు, హెచ్‌సీలు పాల్గొన్నారు.

7న విజయవాడలో ఫ్యాప్టో పోరుబాట

- నేడు మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీ


'పోరుబాట' కరపత్రాలను విడుదల చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

రాజాం సిటీ: ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించి అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఫ్యాప్టో పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఈనెల 7న చలో విజయవాడ కార్యక్రమాన్ని తల పెట్టామని ఫ్యాప్టో నాయకులు రెడ్డి మోహనరావు, మజ్జి మదన్‌మోహన్ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఫ్యాప్టో సమన్వయ సమావేశం నిర్వహిం చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేయాలని, ఆర్థిక బకాయిలు చెల్లించాలని, 12వ పీఆర్‌సీని తక్షణం ప్రకటించాలని కోరారు. ఫ్యాప్టో పోరుబాటలో భాగంగా ఈనెల 4న మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీ, 7న విజయవాడ లో పోరుబాట ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. బైక్ ర్యాలీలను, విజయవాడలో పోరుబాటు కార్యక్రమా న్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోరుబాటకు సంబం ధించిన కరపత్రాలను విడుదల చేశారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల ఫ్యాప్టో నాయకులు పేకేటి రామారావు, యలకల భాస్కరరావు, ఏ.వెంకటప్పలనా యుడు, పి.మురళి, బి.శ్రీనివాసరావు, జి.రమేష్, ఎస్.శివరావు, వి.తారకేశ్వరరావు, బి.జగదీశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, డి.వాసు దేవరావు, బి.ప్రసాదరావు, జి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

వరద నీరు నిలిచి పోకుండా చర్యలు


బొబ్బిలి: వర్షాల కారణంగా రోడ్లపై వరద నీరు నిలిచిపోవడం వల్ల రాకపోకల సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఎప్పటికప్పుడు వర్షపు నీటిని తరలించేలా చర్యలు తీసుకో వాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని పలు ప్రాంతా ల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని లోతట్టు ప్రాంతాల ప్రజలకు సూచించారు.టీబీఆర్ థియేటర్ వద్ద రహదారిపై వరదనీటి ప్రవాహన్ని మళ్లించే పనులను చేయించారు. తాగునీరు,శానిటేషన్ తదితర అంశాలపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీకి దిశానిర్దేశం చేశారు.

అక్రమ మైనింగ్‌పై దాడులు


మైనింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాజాం సిటీ: మండల పరిధి గారాజుచీపురుపల్లి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న మైనింగ్‌పై అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఆర్డీఓ బి.ఆశయ్య ఆధ్వర్యంలో జిల్లా మైనింగ్ అధికారి సీహెచ్.సూర్యచంద్రరావు, తహసీల్దార్ ఎం.రాజశేఖర్ మైనింగ్ ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ నిర్వాహకులు ఎవరూ లేకపోవడంతో 130 మెట్రిక్ టన్నుల మాంగనీస్ ఓర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

దాడితల్లికి క్షీరాభిషేకం


అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

బొబ్బిలి: బైపాస్ రోడ్డులో ఉన్న దాడితల్లి ఆలయంలో అమ్మవారికి అర్చకులు పిండిప్రోలు మణికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం 108 లీటర్ల పాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

బొబ్బిలి: పట్టణంలోని ఐటీఐ కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పెద్దాడ నాగేశ్వ్రరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 19 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఏఎస్‌ఐ కొండలరావు తెలిపారు. సీఐ సతీష్‌కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం తమ సిబ్బందితో సోదాలు నిర్వహించామని తెలిపారు. నాగేశ్వ్రరావును ప్రశ్నించి తనిఖీ చేయగా అక్రమ మద్యం బాటిళ్లు ఉండడంతో అతడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టామని, 14 రోజుల రిమాండ్ విధించారని ఏఎస్‌ఐ తెలిపారు.

మెగా వైద్యశిబిరం రేపు

బొబ్బిలి: స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఉన్న హనుమాన్ చిల్డ్రన్ ఆస్పత్రిలో ఈనెల 5న విశాఖపట్నానికి చెందిన మహాత్మాగాంధీ క్యాన్సర్ హాస్పిటల్, అనీల్ నీరుకొండ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో గుండె సంబంధిత, క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ,మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

రాజాం, బొబ్బిలి నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించాయి. గాంధీజి విగ్రహాలు, చిత్రపటాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు, వివిధ సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


రామభద్రపురం: ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, తదితరులు


రామభద్రపురం: పోలీస్ స్టేషన్‌లో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్‌ఐ వి.ప్రసాదరావు


తెర్లాం: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న హెచ్‌డీటీ సత్యనారాయణ,తదితరులు


రాజాం : ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎల్‌డీఓ హేమసుందరరావు, తదితరులు


బాడంగి: పిండ్రంగివలసలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

అంతర విశ్వవిద్యాలయ కబడ్డీ పోటీలకు ఎంపిక


ఎల్.జగన్‌మోహన్

రాజాం సిటీ: జీఎంఆర్ ఐటీ కళాశాల విద్యార్థి ఎల్.జగన్‌మోహన్ అంతర విశ్వవిద్యాలయ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ఎల్.వి. ఆర్.ఎస్.వి.ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయనగరం జేఎన్‌టీయూ జీవీలో ఈ ఎంపికలు జరిగాయ ని పేర్కొన్నారు. పలు కళాశాలల నుంచి 60 మంది విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొనగా జేఎన్‌టీయూ జీవీ తరపున అంతర విశ్వవిద్యాలయ పోటీలకు జగన్‌మోహన్ ఎంపికయ్యాడని స్పష్టం చేశారు. ఈనెల 4 నుంచి 7 వరకు కర్నాటక రాష్ట్రం బెలగావిలోని చెన్నమ్మ యూనివర్సిటీలో జరగనున్న అంతర విశ్వ విద్యాలయ కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్ వ్యవహారాల డీన్ డాక్టర్ ఎం.రాంబాబు, పీడీ డాక్టర్ బి.అరుణ్‌కుమార్ తదితరులు అభినందించారు.

ముగిసిన దసరా ఉత్సవాలు

బొబ్బిలి/ రాజాం నియోజకవర్గాల్లోని పట్టణాలతో పాటు గ్రామాల్లో దసరా సంబరాలు గురువారంతో ముగిశాయి.దుర్గాదేవి ఆలయాలు, మంటపాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద ఆయుధ, వాహన పూజలు చేశారు.దసరా రోజు పలు ఆలయాల్లో అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో మంటపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్ల విగ్రహాలను ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం నిమజ్జనం చేశారు. రాజాం బస్టాండ్ వద్ద ఉన్న నవదుర్గ ఆలయంలో అమ్మవారు శుక్రవారం నిజరూపదర్శనమిచ్చారు. వేకువ జాము నుంచే భవానీ మాల ధారణ భక్తులు ఇరుముడులు సమర్పించేందుకు ఆలయానికి అధిక సంఖ్యలో చేరుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


రాజాం సిటీ: రాజాంలోని నవదుర్గ ఆలయంలో అమ్మవారి నిజరూప దర్శనం


రాజాం: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన దసరా పూజల్లో ఆ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్


తెర్లాం: తెర్లాంలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భవానీలు


రాజాం: రాజాంలోని గాయత్రీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు


రేగిడి: రేగిలో నిర్వహించిన అమ్మవారి ఊరేగింపులో వివిధ వేషధారణలతో చిన్నారులు


రాజాం సిటీ: రాజాంలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు